## సరస్వతీ నిలయమైన

# కమ్యూనిస్టుల కోట

న్యూస్‌టుడే, నాగులాపల్లి (మునగపాక)

**ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటగా ముద్రపడిన గ్రామం మునగపాక మండలం నాగులాపల్లి. ఉద్యమాలతో చిన్నారుల చదువుసంధ్యలపై సరైన శ్రద్ధపెట్టలేక పోయేవారు. దీంతో దీర్ఘకాలంలో జరుగుతున్న నష్టాన్ని గ్రహించారు ఆ గ్రామస్థులు. తమపంథాను మార్చుకుని తమ బిడ్డలను పెద్ద చదువులు చదివించాలన్న కృతనిశ్చయంతో ముందుకు సాగారు. దీంతో ఈ గ్రామం నేడు విద్యావంతుల గ్రామంగా గుర్తింపు పొందుతోంది.**

నాగులాపల్లిలో ఓనమాలు నేర్చుకుని తల్లిదండ్రుల ఆశయాల మేరకు ఉన్నత చదువులు చదివి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కీలక పదవుల్లో గ్రామానికి పేరు తెస్తున్నారు. సామాన్య వ్యవసాయ కుటుంబాల్లో పుట్టిన వీరంతా పట్టుదలతో చదివారు. గ్రామం గర్వించదగ్గ వివిధ హోదాలలో విధులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన వంద మంది వరకు ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు.

### అణుశాస్త్రవేత్తగా సత్యనారాయణ



గ్రామానికి చెందిన భీశెట్టి అచ్చుయ్య, అప్పియ్యమ్మ దంపతుల చిన్న కుమారుడు సత్యనారాయణ. నాగులాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఓనమాలు నేర్చుకున్నారు. ఉన్నత చదువుచ పి. హెచ్. డి. చేశారు. ముంబయిలోని ప్రతిష్ఠాత్మక టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చిలో సైంటిఫిక్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### మరో శాస్త్రవేత్త శివాజీ

చదరం శివాజీ వ్యవసాయ కుటుంబంలోనే జన్మించారు. నాగులాపల్లి ప్రాథమిక పాఠశాలలో చదివారు. తర్వాత కాలంలో ఉన్నత విద్య పూర్తిచేసి శాస్త్రవేత్తగా పని చేస్తున్నారు. ఢిల్లీలోని మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సైంటిస్టుగా సేవలందిస్తున్నారు. అమెరికా, జపాన్, రష్యా, స్వీడన్, ఇటలీ, జర్మనీ, నేపాల్, టాంజానియా దేశాల్లోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో వృత్తిపరమైన శిక్షణ పొందారు. భూగర్భ శాస్త్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనల్లో నిమగ్నమయ్యారు.

### రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సూరి అప్పారావు



తన ఇంటికెళ్లే రహదారి గొడవే తనను ఇంతటి వాడ్ని చేసిందనే నాగులాపల్లి గ్రామానికి చెందిన వేగి సూరి అప్పారావు హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆయన అన్నదమ్ముల ప్రోత్సాహంతో 'లా' చదివారు. న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించి అంచెలంచెలుగా మునసబ్ మెజిస్ట్రేట్‌గా, జిల్లా జడ్జిగా, ప్రిన్సిపల్ లా సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు.



నాగులాపల్లి గ్రామం

### ఇంకా ఎందరో..

- మళ్ల వెంకట అప్పారావు విశాఖ కేజీహెచ్, ఇ.ఎన్.టి. చీఫ్‌గా విధులు నిర్వహించి పదవీవిరమణ చెందారు.
- మళ్ల జగన్మోహనరావు హైదరాబాద్‌లోని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నారు.
- కుంది తులసీరావు ఇండియన్ ఫారెస్ట్ అధికారిగా పనిచేస్తున్నారు.
- తులసీరావు సోదరులలో సత్యనారాయణ, సబ్‌రిజిస్ట్రార్‌గా హరిప్రసాద్, విశాఖ జీవీఎంసీలో విధులు నిర్వహిస్తున్నారు.
- మరో విద్యావేత్త మళ్ల రమణాజీ (ఐఈఎస్) నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (అస్సాం) అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ పిన్న వయసులోనే మృతి చెందారు.
- ఆయన సోదరులు నూకరాజు వాణిజ్య పన్నుల అధికారిగా మళ్ల మాధవరావు విశాఖ స్టీల్ ప్లాంట్ డిప్యూటీ మేనేజర్‌గా ఎం. ఆర్. ఎస్. ప్రకాష్ ఆంధ్రాబ్యాంకు అధికారి (ముంబాయి)గా, గణేష్, ఎలక్ట్రికల్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్నారు.

ఇలా గ్రామంలోని ఎంతో మంది ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు చేస్తూ గ్రామానికి గుర్తింపు తీసుకొస్తున్నారు.